సిఎం రేవంత్, మంత్రి దామోదరకు కృతజ్ఞతలు

- టి జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్లను హైదరాబాద్ బస్తీల్లో, పేదలున్న ప్రాంతాల్లో, పల్లెల్లో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ టి జగ్గారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. ఆధునిక చికిత్స అందుబాటులోకి వచ్చినా, ముందు గుర్తించే సౌకర్యాలున్నా సరైన అవగాహన లేక క్యాన్సర్ రోగులు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో క్యాన్సర్‌ను ముందే గుర్తించి వైద్యం అందించే బాధ్యత ఇప్పటి ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం ప్రజలకు క్యాన్సర్‌పై ఉన్న భయాన్ని పోగొడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కెటిఆర్‌పై ఎఫ్ఐఆర్‌లు కొట్టివేసిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఉట్నూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను ఉన్నత న్యాయస్థానం సోమవారం కొట్టివేసింది. మూసీ ప్రాజెక్టు పేరుతో రూ.25 వేల కోట్ల నిధులను కాంగ్రెస్ పార్టీ తరలించిందంటూ కెటిఆర్ చేసిన ఆరోపణలు తమ పార్టీ ప్రతిష్టను దెబ్బతీశారంటూ ఆత్రం సుగుణ ఫిర్యాదు చేశారు. దీంతో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు పోలీసుస్టేషన్‌లో గత ఏడాది సెప్టెంబరు 30న కేసు నమోదైంది. ఈ క్రమంలో కేసును కొట్టివేయాలని కోరుతూ కెటిఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఇరువైపుల వాదనలు విన్న కోర్టు.. తాజాగా ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. కెటిఆర్‌పై మహదేవ్‌పూర్ పిఎస్‌లో నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. గతంలో మేడిగడ్డ బ్యారేజీపై డ్రోన్ ఎగురవేసిన ఘటనలో కెటిఆర్, మరికొందరిపై కేసు నమోదైంది. అనుమతి లేకుండా ప్రాజెక్టును సందర్శించి, డ్రోన్ ఎగురవేశారని ఇరిగేషన్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వాదనల సందరర్భంగా మేడిగడ్డ బ్యారేజీ నిషిద్ధ ప్రాంతమేమీ కాదని కెటిఆర్ తరపు న్యాయవాది టివి రమణారావు తెలిపారు. రాజకీయ కక్షతో కేసు నమోదు చేశారని చెప్పారు. మరోవైపు డ్రోన్ ఎగురవేయడం డ్యాం భద్రతకే ప్రమాదమని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం కెటిఆర్‌పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

హామీలు అమలు చేయని బిజెపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చిన బిజెపి వాటిని అమలు చేయలేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ అభివృద్ధికి ఏమీ చేయలేకపోయారని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న బిజెపి నేతలు, రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లను కేంద్రానికి పంపిస్తే ఎందుకు మద్దతివ్వలేదని ప్రశ్నించారు. బలం లేకున్నా హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ పోటీలో బిజెపి ఎందుకు బరిలో దిగింది. మహబూబ్‌నగర్‌లో కొంత బలం ఉన్నా ఎందుకు పోటీ నుంచి దూరం ఉందని ప్రశ్నించారు.

నవ ప్రపంచాన్ని నిర్మిద్దాం

- తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి
- జపాన్ వ్యాపారవేత్తలను ఆహ్వానించిన ముఖ్యమంత్రి
- ఒసాకా ఎక్స్ పోలో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్

వరల్డ్ ఎక్స్ పోలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి జపాన్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్ పోలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బందం పాలుపంచుకుంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపార వేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమైంది. వివిధ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వారితో చర్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఒసాకాలో జరుగుతున్న వరల్డ్ ఎక్స్? పోలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ పాలుపంచుకోవటం గర్వంగా ఉందని అన్నారు. తెలంగాణ, జపాన్‌ల మధ్య ఉన్న చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాల భాగస్వామ్యంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కలిసి పనిచేద్దామనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న స్థిరమైన విధానాలు, సులభతర పారిశ్రామిక విధానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయన్నారు. హైదరాబాద్‌కు రండి.. మీ ఉత్పత్తులు తయారు చేయండి.. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేసేందుకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి..' అని జపాన్ కంపెనీలను సిఎం తెలంగాణకు ఆహ్వానించారు. తెలంగాణకు జపాన్ మధ్య చక్కటి సంబంధాలున్నాయని, ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణతో పాటు ఒసాకా, ప్రపంచంతో కలిసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఐటీ, బయో టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ప్రత్యేకమైన గుర్తింపు సాధించిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వీటితో పాటు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్?టైల్స్? రంగాల పరిశ్రమలకు ఉన్న అనుకూలతలను వివరించారు. హైదరాబాద్ లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నామని, ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీపై ఈ సిటీ ఆధారపడుతుందన్నారు. జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్‌తో ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లతో పాటు ఆర్ఆర్ఆర్కు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మధ్య ఉన్న జోన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందన్నారు. ఎగుమతులకు వీలుగా సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్ ను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా నది పొడవునా 55 కిలోమీటర్ల అర్బన్ గ్రీన్ వే అభివృద్ధి చేసేందుకు టోక్యో, ఒసాకా నగరాలను చూసి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని అన్నారు. నైపుణ్యాల శిక్షణతో పాటు నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేశామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఈ యూనివర్సిటీ రాష్ట్రంలో ఉపాధి, వ్యాపార అవకాశాలను రెట్టింపు చేస్తుందన్నారు.

శాంతి దూతగా చెరగని ముద్ర వేసిన పోప్ ఫ్రాన్సిస్
ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి

శాంతి దూతగా ప్రపంచంపై పోప్ ఫ్రాన్సిస్ చెరగని ముద్ర వేశారని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేథలిక్ చర్చి అధిపతి పోప్ ఫ్రాన్సిస్ మరణంపై ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ తన జీవితాన్ని చర్చి, మానవ సేవకు అంకితం చేశారని, శరణార్థులకు మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి కొనియాడారు. సామాజిక న్యాయం, మత సామరస్యం పెంపునకు ఆయన అవిశ్రాంతంగా శ్రమించారని పేర్కొన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం మానవాళికి తీరని లోటని సిఎం తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేథలిక్ సమాజానికి ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సానుభూతిని తెలియజేశారు.

భర్త వేధింపులు భరించలేక

- కూతురుతో కలిసి భర్తను హత్య చేసిన భార్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి రోజూ మద్యం సేవించి వచ్చి వేధింపులకు గురిచేస్తున్న భర్తను భార్య, కూతురు కలిసి హత్య చేసిన సంఘటన మెదక్ జిల్లా పాపన్న పేట మండలం నామాపూర్‌లో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నామాపూర్ గ్రామానికి చెందిన గొల్ల జోగయ్య (51) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసయిన జోగయ్య.. ప్రతి రోజూ తాగి ఇంటికి రావడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. విసుగు చెందిన భార్య నాగమ్మ ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో చిన్న కూతురుతో కలిసి జోగయ్య మెడకు చీరతో ఉరి బిగించి హత్య చేసింది. కూతురు అతని కాళ్ళు పట్టుకోగా నాగమ్మ గొంతుకు ఉరి బిగించింది. సాయంత్రం సమయంలో పొరుగున ఉన్నవారు జోగయ్య ఇంటికి వెళ్లగా.. చలనం లేకుండా జోగయ్య పడి ఉండటాన్ని గమనించి చికిత్స కోసం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. సోమవారం బంధువులకు విషయం తెలవడంతో వారు అక్కడికి చేరుకొని పరీక్షించగా జోగయ్య మెడకు కమిలిన గాయం కనిపించింది. అనుమానం వచ్చి భార్య నాగమ్మను నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుని సోదరి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నేడే ఇంటర్ ఫలితాలు

- 12 గంటలకు విడుదల చేయనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని నాంపల్లి ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఫలితాలను విడుదల చేస్తారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంటర్ ఫలితాలను ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ స్త్రఎఱవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ ద్వారా తెలుసుకోవాలి. సమాచారం కోసం విద్యార్థులు ఐవీఆర్ పోర్టల్ 9240205555 నెంబర్‌ను సంప్రదించాలి. లేదంటే ఈ-మెయిల్ helpdesk-ie@telangana.gov.in కు మెయిల్ పంపాల్సి ఉంటుంది. గత నెల ఐదు నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,88,448 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,08,523 మంది కలిపి మొత్తం 9,96,971 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

26న బ్రిడ్జ్‌గ్యాప్ మార్కెటింగ్ కాన్‌క్లేవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆధునిక వ్యాపార ప్రపంచంలో కుటుంబ వ్యాపారాలను శక్తివంతం చేయడమే లక్ష్యంగా బ్రిడ్జ్‌గ్యాప్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 26వ తేదీన బ్రిడ్జ్‌గ్యాప్ మార్కెటింగ్ కాన్‌క్లేవ్ నిర్వహించనున్నట్లు బ్రిడ్జ్‌గ్యాప్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ ఫౌండర్, పార్టనర్ విపిన్ సింగ్ తెలిపారు. కుటుంబ యజమానులు, తదుపరి తరం యువ పారిశ్రామికవేత్తల కోసం ఈ కాన్‌క్లేవ్ ప్రత్యేకంగా రూపొందించామని పేర్కొన్నారు. మార్కెటింగ్, బ్రాండింగ్, ప్రకటనలతో సంప్రదాయ వ్యాపారాలు ఏ విధంగా ముందుకు వెళ్లాలో తెలియజేస్తుందని పేర్కొన్నారు. సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక వ్యూహాలతో మేళవించేందుకు ఇది ఒక వేదికగా నిలుస్తుందన్నారు. ఇందులో అనేక వ్యాపార అంశాలను చర్చించనున్నట్లు తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ కోదండరాం

డ్రగ్స్ వాడకం దేశ ప్రగతికి గొడ్డలి పెట్టు

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్ వాడకం దేశ ప్రగతికి గొడ్డలిపెట్టుగా మారిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని మాణిక్యపూర్, రత్నగిరి, వంగర, రంగయ్యపల్లి గ్రామాల్లో జెఎసి మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రకు ఆయన హాజరై మాట్లాడారు. డ్రగ్స్‌కు విద్యార్థులు, యువత అలవాటు పడటం బాధాకరమన్నారు. డ్రగ్స్ వాడకాన్ని నిర్మూలించే బాధ్యత నేడు అందరిపై ఉన్నదని అన్నారు. డ్రగ్స్ వాడటం మొదలైతే వదలడం సాధ్యంకాదనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. సిగరెట్, గుట్కా, అంబర్, గంజాయి వంటి మత్తు పదార్థాలు వాడటం వల్ల కుటుంబాలు ఆర్థికంగానే కాకుండా మానసికంగానూ దెబ్బ తింటున్నాయని తెలిపారు. కుటుంబ పెద్దలు పిల్లల నడవడికని గ్రహించి ముందే అరికట్టాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమం హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదట ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. ఫ్లెక్సీలు, ప్లే కార్డ్స్ చేత పట్టుకొని గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ చైర్మన్ కవ్వా లక్ష్మారెడ్డి, మండల జేఏసీ చైర్మన్ డేగల సారయ్య, నాయకులు చెప్పియాల ప్రకాష్, కేడం లింగమూర్తి, బొలిశెట్టి శివయ్య, ముక్కెర రాజు, విద్యాసాగర్, ప్రొఫెసర్ వీరన్ననాయక్, డాక్టర్ ఏదులాపురం తిరుపతి, ఒగ్గె శేఖర్, గాండ్ల పద్మ, సిడిపిఒ స్వరూప, ఏపీఎం దేవానందం, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీఆర్ఎస్ రజతోత్సవమా.. బీఆర్ఎస్ రజతోత్సవమా ?

కార్యక్రమం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. కేసీఆర్ పెట్టే రజతోత్సవ సభ టీఆర్ఎస్ పార్టీ దో.. బీఆర్ఎస్ పార్టీదో వారికే తెలియని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. టీఆర్ఎస్ పార్టీ తెలంగాణతో తెగతెంపులు చేసుకొని బీఆర్ఎస్‌గా మారిందని తెలిపారు. సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, రైల్ రోకో లాంటి కార్యక్రమాలు చేసి వందలాది మంది అమరులైతే అధికారంలోకి వచ్చిన తర్వాత అహంకారంతో వారిని విస్మరించారని ఆరోపించారు. ధర్నాచౌక్‌ను ఎత్తివేసి నిరసన తెలిపే హక్కును కేసీఆర్ కాలరాశారన్నారు. ఒక్కడినే తెలంగాణ తెచ్చాననే అహంకార భావంతో ప్రజల్లో చులకన అయ్యారన్నారు. బీఆర్ఎస్ పార్టీ మునిగిపోయే నావ లాంటిదని, ఇక అధికారంలోకి రావడం ఒక కలగానే మారిపోతుందన్నారు.

విమాన రక్షణ, అగ్నిమాపక శిక్షణ పున్ణప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విమానయాన శిక్షణా సంస్థ జీఎంఆర్ ఏరో అకాడమీలో విమాన రక్షణ, అగ్ని మాపక శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం హైదరాబాద్ క్యాంపస్‌లో తిరిగి ప్రారంభించినట్టు ఆ సంస్థ ప్రకటించింది. జాతీయ, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఈ కార్యక్రమాన్ని 2013 నుంచి 2018 మధ్యకాలంలో హైదరాబాద్‌లో 350 మందికిపైగా సిబ్బందికి శిక్షణను అందించిన తర్వాత, ఇప్పుడు మళ్లీ ప్రారంభమవుతోంది. తొమ్మిదవ బ్యాచ్ 2025 మే 14న ప్రారంభం కానుంది. మొత్తం 24 వారాల పాటు సాగే ఈ సమగ్ర కోర్సు ఐసీఏవో ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించారు. ఇందులో ఆధునిక ఫైర్‌ఫైటింగ్ పరికరాలతో ప్రాక్టికల్ శిక్షణ, పరిశ్రమలో అనుభవమున్న అధ్యాపకులతో బోధన ఏర్పాట్లు ఉంటాయి. ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు జీఎంఆర్ ఏఏ నిర్వహిస్తున్న 15కి పైగా భారతీయ విమానాశ్రయాలు, ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తదితర ప్రముఖ విమానయాన సంస్థలతో ఉన్న భాగస్వామ్యాల ప్రయోజనాలను పొందగలుగుతారని తెలియజేసింది. భారతదేశంలో విమానయాన రంగం వేగంగా అభివద్ధి చెందుతున్నప్పటికీ, నూతనంగా అభివద్ధి చెందుతున్న అనేక విమానాశ్రయాల్లో అగ్నిమాపక, రక్షణ సిబ్బంది కోసం ఎక్కువ డిమాండ్ ఏర్పడుతున్నది. ఈ శిక్షణ పున్ణప్రారంభం తెలంగాణతో పాటు పరిసర దక్షిణాది రాష్ట్రాల యువతకు ముఖ్యంగా ఉపయోగపడనుందని ఆ సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా జీఎంఆర్ ఏరో అకాడమీ అధ్యక్షుడు మిస్టర్ అశోక్ గోపినాథ్ మాట్లాడుతూ "విమానాశ్రయాల్లో అగ్నిమాపక సిబ్బంది విమానయాన భద్రతకు పరిరక్షకులుగా నిలుస్తారు. వారు తీసుకునే తక్షణ నిర్ణయాలు, చర్యలు ఎన్నో ప్రాణాలను కాపాడతాయి. మా సైనికుల మాదిరిగానే, ఈ సిబ్బంది కూడ శ్రద్ధతోపాటు ధైర్యంగా పని చేస్తూ ప్రయాణికులు, విమానాశ్రయ సిబ్బందికి రక్షణ కల్పించేందుకు క్లిష్ట పరిస్థితుల్లో పనిచేస్తారని అన్నారు. ప్రస్తుత డిమాండ్‌కు సరిపడా మానవ వనరులు లేవు. అందుకే ఈ ప్రోగ్రామ్ ఎంతో అవసరమన్నారు.

జిహెచ్ఎం ఉద్యోగోతులు కల్పించాలి

- విద్యాశాఖ కార్యదర్శికి ఎమ్మెల్సీ కొమరయ్య వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల (జీహెచ్ఎం-2)కు ఉద్యోగోన్నతులను కల్పించాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న జీహెచ్ఎం పోస్టులను అర్హులైన సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. గతంలోనే జీహెచ్ఎం ఉద్యోగోన్నతులను కల్పించడానికి అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులతో సీనియార్టీ జాబితాను రూపొందించి వెబ్ ఆప్షన్లను నమోదు చేసే సమయంలో సాంకేతిక కారణాల వల్ల ఆ ప్రక్రియ వాయిదా పడిందని తెలిపారు. ఇటీవల తాను నిజామాబాద్ పర్యటనలో ఉన్నపుడు జీహెచ్ఎం ఉద్యోగోన్నతులు కల్పించేలా చొరవ చూపాలంటూ ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారని పేర్కొన్నారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఏ విధమైన ఖాళీల్లేకుండా చూడాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభ సమయానికి పాఠ్యపుస్తకాలు, ఉచిత ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని రకాల చర్యలనూ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, నాయకులు బి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

తప్పులు చేస్తే శిక్షలు తప్పవు

- 'భూభారతి' సదస్సులో అధికారులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం
- ప్రతి రైతుకూ భూభారతి ద్వారా న్యాయం చేస్తాం..
- త్వరలో 6 వేల మంది సర్వేయర్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూభారతి చట్టంపై, రైతుల సమస్యలపై అవగాహన పెంచుకోకపోవడం.. క్షేత్రస్థాయిలో పరిశీలన లేకపోవడంతో అధికారులపై రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టంపై అధికారులు అవగాహన పెంచుకోకపోయినా, తప్పులు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ చట్టం ద్వారా సాగులో ఉన్న ప్రతి రైతుకూ న్యాయం చేస్తామని మంత్రి చెప్పారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలు, రైతులకు, భూములున్న ఆసాముల కోసం ఈ చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన తెలంగాణ భూ భారతి- 2025 చట్టంపై సోమవారం నల్లగొండ జిల్లా చందంపేట మండల కేంద్రంలో, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామని, నెలాఖరకు పైలెట్ ప్రాజెక్టు పూర్తవుతుందని చెప్పారు. జూన్ రెండు నుంచి పైలెట్ మండలాల్లో వ్యవసాయ భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించనున్నామని తెలిపారు. మే 1 నుంచి అన్ని జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుంటామన్నారు. అత్యంత వెనుకబడిన చందంపేట మండలాన్ని పైలెట్ మండలంగా తీసుకునే విషయమై ఆలోచిస్తామన్నారు. ప్రతి గ్రామానికీ తహసీల్దార్ స్థాయి అధికారులు వచ్చి భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటారని, రైతులు రూపాయి చెల్లించకుండా రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని అన్నారు. భూముల సర్వే కోసం 6 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించనున్నామని తెలిపారు. ప్రతి గ్రామానికీ గ్రామ పరిపాలన అధికారి చొప్పున 10695 మంది మే మొదటి వారంలో రానున్నట్టు వివరించారు. ప్రతి మనిషికి ఆధార్ కార్డు లాగే భూధార్ కార్డు ఇచ్చి ఖాతా నెంబర్ ఇవ్వనున్నామన్నారు. గతంలో భూములు అమ్మినా, కొన్నా మ్యాపింగ్ లేదని, ఇకపై రాష్ట్రవ్యాప్తంగా భూమి రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాప్ ఏర్పాటు చేసేలా చట్టంలో తీసుకొచ్చామని చెప్పారు. సాదా బైనామాలను పరిష్కరిస్తామన్నారు. 9 లక్షల 26 వేల సాదాబైనామా దరఖాస్తులున్నాయని, వాటిలో న్యాయమైన వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ చట్టాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. గతంలో పట్టాలిచ్చిన డి-లిమిటేషన్ ఫారెస్ట్ భూములను పరిశీలించి, ఎవరు ఎంత భూమి సాగులో ఉన్నా రైతులకు పట్టాలు ఇస్తామని తెలిపారు. పునరావాసం కింద ఒక చోట నుంచి మరోచోటికి రైతులు వెళ్లిన సందర్భంలో ఇచ్చిన భూముల డీ లిమిటేషన్‌లో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. భూ సమస్యల పరిష్కరించుకునేందుకు గత ప్రభుత్వంలో రైతులు మంగళసూత్రాన్ని అమ్మి కోర్టుకు ఎక్కాల్సిన దుస్థితి ఉండేదని ఇబ్రహీంపట్నం సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 18 లక్షల ఎకరాలు పార్ట్-బిలో పెట్టారని, వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. ఇండ్ల స్థలాల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ధరణి మాదిరిగా భూభారతిలో తప్పులు చేయకూడదన్నారు.

దేవరకొండ ఆర్డీఓపై మంత్రి ఆగ్రహం

రెవెన్యూ డివిజన్‌పై దేవరకొండ ఆర్‌డీఓకు ఏమాత్రం అవగాహన లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై మంత్రి అడిగిన ప్రశ్నలకు ఆర్డీఒ రమణారెడ్డి సరైన సమాధానం చెప్పలేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీఓగా వచ్చి 6 నెలల అయినప్పటికీ భూభారతి చట్టంపై సరైన అవగాహన లేదన్నారు. భూ సమస్యలపై రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సబ్జెక్టు మీద అవగాహన లేదని, క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆర్డీఓకు సూచించారు. భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోకపోతే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు

ప్రయివేటు మెడికల్ కాలేజీలకు మంత్రి దామోదర హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యవిద్యలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన ప్రయివేటు మెడికల్ కాలేజీల మేనేజ్‌మెంట్స్, డీన్స్, ప్రిన్సిపాల్స్‌తో సమావేశమయ్యారు. మెడికల్ ఎడ్యుకేషన్ నాణ్యత ప్రమాణాలు, ఎన్ఎంసి నిబంధనలు, ఫాకల్టీ, అటెండెన్స్, ఫీజులు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, కాళోజీ హెల్త్ యూనివర్శిటీ విసి డాక్టర్ నందకుమార్ రెడ్డి, డిఎంఇ డాక్టర్ నరేంద్ర కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ డాక్టర్లకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు ఉందని గుర్తుచేశారు. ప్రపంచంలోని ఎన్నో ప్రఖ్యాత మెడికల్ ఇనిస్టిట్యూట్స్‌ను రాష్ట్రంలో చదువుకున్న డాక్టర్లు నడిపిస్తున్నారని తెలిపారు. ఇక్కడ పాటించిచన వైద్యవిద్య ప్రమాణాల వల్లే అది సాధ్యమైందని చెప్పారు. ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో ఘోస్ట్ ఫాకల్టీని పెట్టి నడిపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఈ పద్ధతి మంచిది కాదని హెచ్చరించారు. ఇలాంటి చర్యలు వల్ల వైద్య విద్య ప్రమాణాలు దిగజారుతాయన్నారు. మెడికల్ స్టూడెంట్స్‌కు స్టైఫండ్స్ చెల్లించే విషయంలో కొన్ని కాలేజీలపై వరసగా ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. విద్యార్థులకు ఇచ్చే స్టైఫండ్ విషయంలో రాజీ పడొద్దని సూచించారు. విద్యార్థులకు ఉపకారవేతనాన్ని కచ్చితంగా చెల్లించాలన్నారు. ఆయా కాలేజీలకు అనుబంధంగా ఉన్న టీచింగ్ హాస్పిటల్స్‌లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అదనపు ఫీజుల కోసం స్టూడెంట్స్‌ను ఇబ్బంది పెట్టినా, అడ్వాన్స్‌గా ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్ఎంసీ నిబంధనల విషయంలో కాలేజీలు లేవనెత్తిన సమస్యలను, ఎన్ఎంసి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి
-పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి దామోదర

ఎండలు ముదురుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని టిజిఎంఎస్ఐడిసి కార్యాలయంలో వడ దెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుపుతూ ఆరోగ్యశాఖ రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బయటకు వెళ్లినప్పుడు ఎండదెబ్బ బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగు నీరు తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని, ఎక్కువసేపు ఎండలో ఉండకూడదని సూచించారు. ఒకవేళ ఏదైనా ఇబ్బంది కలిగితే తక్షణమే సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లాలని కోరారు. తమ చుట్టూ ఉన్నవారిలో ఎవరికైనా వడ దెబ్బ తగిలితే, వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు బాధితున్ని తరలించాలనీ, 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేయాలని మంత్రి ప్రజలను కోరారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు మరింత అప్రమత్తంగా ఉండాలనీ, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. వడదెబ్బపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి టీచింగ్ హాస్పిటల్స్ వరకూ అన్ని చోట్ల వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు వీలుగా వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

In the Court of the IV Addl. District Judge : Nellore, A.P.
A.S.No. 84 / 2022
Tekuru Damodar Rao - Appellant
Vs
1. **Tekuru Radha Krishna** and 5 others - Respondents

Notice

To,
R4. Sola Nirmala, W/o **Prasada Rao,** Resident of Flat No.212, Sovereign Shetty Apartments, Red Hills Road, Near Neelofar Hospital, Lakdikapool, Hyderabad-500 004.

పై నెంబరున అప్పిలెంట్ నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు ఒ.ఎస్.నెం. 11/2013 అను దావాలో తే13-06-2022దిన ఇచ్చిన తీర్పుమీద పై తెలిపిన కోర్టులో అప్పిలు దాఖలు చేసియున్నారు. సదరు అప్పిలులో మీకు నోటీసు నిమిత్తం **తే08-05-2025దికి** వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

Sk. Yussaf, B.Com., B.L.,
Nandivelugu Mahadeva Sastri, B.Com., B.L.,
Shameer Shaik, M.B.A., LL.B.,
అప్పిలెంట్ తరపు న్యాయవాదులు, కోవూరు.

మహారాజశ్రీ రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
A.S.No: 11/2024
షాహాపురం సత్యనారాయణ died his legal heir షాహాపురం ప్రమోద్ S/o late షాహాపురం సత్యనారాయణ వారసత్వ అర్చక శ్రీఆంజనేయస్వామి దేవస్థానం, కుంపిణీపురం నివాసం, D/No : 5/99, CDV రావు వీధి, కడప (po). ...అప్పీలెంట్

V/s

1.జె. ప్రహ్లాద రావు S/o హనుమంతు, కార్పొరేషన్ బ్యాంకు ఉద్యోగి, A.C నగర్ బ్రాంచి, హైదరాబాద్.
2.జె. ఉష, W/o late జె.వి. రమణా రావు, ప్లాట్‌నెం.231-2-21, శ్రీపురం కాలనీ, old marcket, హైదరాబాద్.
3.జె. సమీర, S/o late జె. వెంకట రమణారావు, ప్లాట్ నెం: 231-2-21,శ్రీపురం కాలనీ, old marcket, హైదరాబాద్.
4.జె. హరీష్, S/o late జె.వి రమణారావు, ప్లాట్ నెం: 231-2-21, శ్రీపురం కాలనీ, హైదరాబాద్.
...రెస్పాండెంట్లు 5 to 8

అప్పీలు నోటీసు

అప్పెలెంటు 5 to 8 రెస్పాండెంట్లు పైన గౌరవ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు వారి O.S. No:17/2012 తీర్పు మీద పై అప్పీలు దాఖలు చేసియున్నారు. కావున రెస్పాండెంట్లు 5 to 8 లకు ఏవైనా ఆక్షేపణలు ఉన్నయెడల 06.05.2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరు కావలెను. లేనంతట పరోక్షము నందు తీర్మానించబడును.

//By order of the Court//
A.V. సుబ్రహ్మణ్యం, B.Com., B.L.,
అడ్వకేట్,
నందలూరు. 9440129650.

కార్పొరేట్లకు దోచిపెడుతున్న పాలకులు

- పేదల ఇళ్లకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి
- సమస్యల పరిష్కారంలో వరంగల్ కార్పొరేషన్ విఫలం : ఎస్. వీరయ్య
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు సంపదను దోచిపెడుతున్నాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. హనుమకొండ జిల్లాలో స్థానిక సమస్యలపై సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 20రోజులు సర్వే నిర్వహించారు. అందులో వచ్చిన సమస్యలపై సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్ట్స్, అండ్ సైన్స్ కళాశాల నుంచి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ధర్నాలో వీరయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఇండ్లు లేని నిరుపేదలు ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు వేసుకొని ఏళ్ల తరబడి జీవనం కొనసాగిస్తున్నా పాలకులు వారికి పట్టాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వీరంతా ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు అనర్హులు కావడంతో సొంత ఇంటి కల నెరవేరే పరిస్థితి లేదన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కార్మికులు, రైతు కార్మికులు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని తెలిపారు.

ఏడో గ్యారంటీ పేరుతో ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతానని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. పేదలకు కనీసం తమ నిరసన తెలపడానికి కలెక్టర్ కార్యాలయం ముందు టెంట్లు వేసుకోవడానికి కూడా అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఎనిమిది పార్లమెంట్ సీట్లు గెలిచిన బిజెపి.. రాష్ట్రానికి రావాల్సిన బడ్జెట్ విషయంలో కానీ, తెలంగాణ విభజన హామీలను అమలు చేయించడంలోనూ విఫలమైందన్నారు. పేదలు వేసుకున్న ఇండ్లకు వెంటనే పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలను పాలక వర్గాలు విస్మరించి కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి.. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో వరంగల్ కార్పొరేషన్ విఫలమైందన్నారు. సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమ్మయ్యనగర్, ఇంజినీరింగ్ కాలనీ, జ్యోతిబసు నగర్ పేస్ 1,2, కోమళ్ల కుంట, సుర్జిత్ నగర్, జ్యోతిరావుపూలే నగర్, ఎంఎన్ నగర్, పలివేల్పుల, భగత్‌సింగ్ నగర్, ప్రగతినగర్, నాగేంద్రనగర్ తదితర కాలనీల్లో ఏండ్ల తరబడి నివాసముంటూ కరెంటు బిల్లులు, మున్సిపల్ టాక్స్‌లు చెల్లిస్తున్నారని, కానీ నేటికీ వారికి పట్టాలివ్వలేదన్నారు. ఇళ్లు లేని నిరుపేదలు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో గుడిసెలు వేసుకొని ఉంటున్నారని, వారందరికీ పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అంబేద్కర్ నగర్, శాయంపేటలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నేటికీ పంపిణీ చేయకపోవడంతో అవి శిథిలమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం చుక్కయ్య, బొట్ల చక్రపాణి, రాగుల రమేష్, గొడుగు వెంకట్, వాంకుడోతు వీరన్న, జి రాములు, డి తిరుపతి, కె లింగయ్య, డి భాను నాయక్, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

జూనియర్ ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో జూనియర్ ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో నేటి నుంచి వచ్చే నెల 12 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి మార్కుల ఆధారంగా సీట్ల కేటాయించనున్నట్టు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 040-23328266లో సంప్రదించాలని సూచించారు.

చేనేత పరిశ్రమ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో చేనేత పరిశ్రమ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్‌కు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనం శాంతికుమార్, గంజి మురళీకృష్ణ, నాయకులు ముషం నరహరి వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని తెలిపారు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోవటమేగాక, చేసిన కష్టానికి తగిన ఆదాయం రాకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కొందరు వలసబాట పడితే, మరికొందరు ఆత్మహత్యలకు గురవుతున్నారని తెలిపారు. జియో టాగ్ మగ్గాల పరిశీలన పేరుతో అధికారులు వారిని వేదింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చేనేత కళను ప్రోత్సహించాలనీ, ఆ పరిశ్రమ పరిరక్షణ, కార్మికులు ఉపాధి సంక్షేమం కోసం తగిన పథకాలను రూపొందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఉద్యోగాన్ని ప్రజల కోసమే వాడాలి

- ఇఎస్‌సిఐ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగాన్ని ప్రతీక్షణం ప్రజల కోసం వాడాలని, ఇంజనీరింగ్ సబ్జెక్టు నిత్య నూతనమైందని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు తెలిపారు. ఆదిమ కాలంలో ఆహారం కోసం జంతువులను వేటాడే బల్లెము నుంచి గొడ్డళ్లు, కొడవళ్లు, కత్తులు, బాణాల తయారీ నుంచి నేటి ఆర్టిఫిషల్ టెక్నాలజీ దాకా ఇంజనీరింగ్‌లో అద్భుతమైన ప్రయోగాలు వచ్చాయని, ఇంకా వస్తున్నాయని అన్నారు. ఈ టెక్నాలజీ వెనుక అపారమైన మేధస్సు కలిగిన ఇంజినీర్లు ఉన్నారన్నారు. జిహెచ్ఎంసిలో నూతనంగా నియమించబడి వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు మొదటి బ్యాచ్ కింద ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని డాక్టర్ రామేశ్వర్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంతో అదృష్టముంటేగానీ ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని, ఇంతటి గొప్ప అవకాశాన్ని సర్వీస్‌లో ఉన్న ప్రతి క్షణం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు సేవ చేస్తున్నాననే గొప్ప భావనతో పని చేస్తే మంచి పేరు ఉంటుందని, ప్రభుత్వంలో కూడా మంచి గుర్తింపు వస్తుందని చెప్పారు. సివిల్ ఇంజినీరింగ్ ఒక్కటే కాదు, ఏరోస్పేస్ ఇంజినీరింగ్, మెరైన్, మెకానికల్, మైనింగ్, ప్రొడక్షన్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ లాంటి సుమారు 15 రకాల ఇంజినీరింగ్ సబ్జెక్ట్స్‌లో అంతులేని ప్రగతిని మనం చూస్తున్నామన్నారు. ప్రపంచ ప్రగతికి ఇవి బాటలు వేస్తున్నాయన్నారు. కాలేజ్‌లోని ఎన్విరాన్‌మెంట్ డివిజన్, సెంటర్ ఫర్ క్లైమేట్ ఛేంజ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమంలో జీహెచ్ఎంసీ గవర్నెన్స్, ఆపరేషనల్ ఫ్రేమ్ వర్క్, స్ట్రక్చర్, రెగ్యులేషన్స్, మున్సిపల్ బడ్జెటింగ్, ఫైనాన్సియల్ మేనేజిమెంట్, అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, అర్బన్ ప్లానింగ్ డెవలప్‌మెంట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర వాటిల్లో సీనియర్ అధికారులతో శిక్షణ ఇస్తారు. ఈ సమావేశంలో సీనియర్ ఫ్యాకల్టీలు కె.రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ నరేష్, నాగమల్లేశ్వరరావు, బ్యాచ్ 1 చెందిన 30 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. వచ్చే వారం నుంచి మరొక బ్యాచ్‌తో విడతల వారీగా నాలుగైదు బ్యాచులుంటాయని ఆర్గనైజర్ డాక్టర్ నరేష్ తెలిపారు.

సొరంగం డేంజర్ జోన్‌లో సహాయక చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బిసి) సొరంగంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 22న టన్నెల్ కూలిన విషయం తెలిసిందే. టన్నెల్‌లో 281 మీటర్ల మేర పేరుకుపోయిన మట్టి, రాళ్లు, ప్రమాదంలో ధ్వంసమైన టన్నెల్ బోరింగ్ యంత్రం (టిబిఎం) భాగాలను ఇప్పటికే బయటకు తరలించారు. మరో 43 మీటర్లను డేంజర్ జోన్‌గా గుర్తించారు. ఈ జోన్‌కు సమీపంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ డేంజర్ జోన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు అనుసరించాల్సిన మార్గాలపై అధికారులు, సహాయక సిబ్బంది అన్వేషణ సాగిస్తున్నారు. ఈ జోన్ సమీపంలో భారీగా వస్తున్న నీటిని మోటార్లతో బయటకు తోడిపోస్తున్నామని ప్రత్యేకాధికారి (ఐఎఎస్) శివశంకర్ వివరించారు.

ఎసిబికి చిక్కిన నాగారం మున్సిపల్ ఇంజనీరింగ్ డిఇ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంట్రాక్టర్ నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ నాగారం మున్సిపల్ డీఈ ఏసీబీకి చిక్కాడు. సోమవారం ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలోని ఆర్ఎల్ నగర్ కాలనీలో రూ.11 లక్షల సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. దానికి ఎంబీ చేసేందుకు రూ.లక్ష 30 వేలు కమీషన్ ఇవ్వాలని కాంట్రాక్టర్ రమేష్‌ను డీఈ రఘుతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, రాకేష్ డిమాండ్ చేశారు. దాంతో బాధిత కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. నాగారం మున్సిపల్ కార్యాలయంలో డీఈ రఘు, సిబ్బంది రాకేష్, సురేష్ కాంట్రాక్టర్ వద్ద రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగొద్దు

- మనదేశాన్ని దెబ్బతీసే ఒప్పందాలు చేసుకోవద్దు
- లేకపోతే దేశవ్యాప్త ఉద్యమం తప్పదు
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వ్యవసాయరంగానికి గొడ్డలిపెట్టు
- ఎస్‌కెఎం ప్రదర్శనలో నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ సర్కార్ లొంగొద్దని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. మన దేశాన్ని దెబ్బతీసే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవద్దని వారు కోరారు. వ్యవసాయ, పాడి పరిశ్రమ, మత్స్యరంగం, పారిశ్రామిక రంగాలకు గొడ్డలిపెట్టుగా ఉన్న ఆ ఒప్పందాలను తిరస్కరించాలన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కెఎం) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు వద్ద అమెరికా ఉపాధ్యక్షులు జెడీ వాన్స్ భారత పర్యటనను నిరసిస్తూ అఖిల భారత పిలుపులో భాగంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఎస్‌కెఎం కన్వీనర్లు టి.సాగర్, జక్కుల వెంకటయ్య, ప్రభులింగం, నాగిరెడ్డి, కాంతయ్య, సత్యనారాయణ, రవీందర్ గౌడ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, రాష్ట్ర కార్యదర్శి అనగండి వెంకటేశ్, ఏఐకెఎస్ ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు శివకుమార్, ప్రయివేట్ టీచర్స్ ఆర్గనైజేషన్ నాయకులు అయిత విజయకుమార్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు భూపాల్, ఈశ్వర్ రావు, కూరపాటి రమేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. జెడి వాన్స్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. బ్యానర్‌ను చేతబూని ప్ల కార్డులతో నిరసన ప్రకటించారు. మొండిగా ఒప్పందాలు చేసుకుంటే గతంలో మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం నిర్వహించినట్టే మరోసారి ఉద్యమం తప్పదని వారు హెచ్చరించారు.

వారు మాట్లాడుతూ ఆస్ట్రేలియాతో కుదిరిన ఒప్పందం ప్రకారం, నిర్దిష్ట పరిమాణంలో కందులు, శనగపప్పు దిగుమతులపై జీరో-డ్యూటీకి భారతదేశం ఇప్పటికే సంసిద్ధతను వ్యక్తం చేసింది. అమెరికన్ రైతులకు ఎరువులు తదితర వ్యవసాయ రాయితీలు ఇస్తూ భారతదేశంలో మాత్రం రైతులకు సబ్సిడీలు ఇవ్వొద్దంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సుంకాలు, మార్కెట్ పరిమితులను ఎత్తేస్తే భారతదేశానికి అమెరికా పాల ఎగుమతులు భారీగా పెరిగి, దేశీయ పాడి రైతుల మరణానికి కారణమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జన్యుపరంగా మార్పు చెందిన మొక్కజొన్న, ఇథనాల్‌పై భారతదేశం దిగుమతి నిషేధాన్ని తొలగించాలనే ఒత్తిడి తెస్తూ అమెరికాకు 300 మిలియన్ డాలర్లు ఆకస్మిక లాభాలు ఆశిస్తున్నారని తెలిపారు. సోయాబీన్, బాదం, పిస్తా, వాల్‌నట్, ఆపిల్ మరియు ఉద్యాన పంటలు అన్నీ చర్చల కోసం సిద్ధంగా ఉంచారని విమర్శించారు.

భారతీయ పత్తి రైతులు ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో ఉండి ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ సుంకాలను పసం హరించుకోవడానికి చర్చలు జరపడమేంటని ప్రశ్నించారు. అమెరికా వాణిజ్య ప్రతినిధుల పర్యటన సందర్భంగా భారత ప్రభుత్వం బోల్‌గార్డ్ 2 గరిష్ట రిటైల్ ధరను 450 గ్రాముల ప్యాకెట్‌కు రూ.48 పెంచిందని గుర్తుచేశారు. సగటున సంవత్సరానికి 4.5 కోట్ల ప్యాకెట్లు అమ్ముడవుతున్నందున పెద్ద వ్యవసాయ వ్యాపారాలకు ఎంత భారీ లాభాలు వస్తాయో ఊహించవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి చవకైన పత్తితో భారతీయ రైతుల మార్కెట్ వాటాను ఆక్రమించడానికి ఉద్దేశించిన చర్య ఇదని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బీజేపీ నేతత్వంలోని ఎన్డీఏ ఎవరి ప్రయోజనాలను తీరుస్తున్నాయి? అని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వాలను, పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోకుండానే అన్ని చర్చలు జరుగుతున్నాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ఒప్పందాలు అంతర్జాతీయ కార్మిక ప్రమాణాల అమలుకు హామీ ఇవ్వబోవని తేల్చి చెప్పారు. చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలు ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా బలంగా ప్రతిఘటించి, తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి నిలబడినప్పటికీ, భారత దేశం తన జాతీయ ప్రయోజనాలను వదులుకుంటున్నదని ఆరోపించారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ భారతదేశాన్ని అదే పనిగా అవమానిస్తున్నప్పటికీ, ప్రభుత్వ ఆదేశం మేరకు ఎయిర్‌టెల్, జియో ఇటీవల ఎలన్ మస్క్ కంపెనీ స్టార్‌లింక్ తో ఒప్పందం కుదుర్చుకున్నాయని చెప్పారు. ఇలాంటి ఒప్పందాలతో వ్యవసాయం, జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, ఆటో విడిభాగాలు రంగాల్లోని లక్షలాది మంది కార్మికుల ప్రయోజనాలు కూడా దెబ్బతింటాయని విమర్శించారు.

ప్రొఫెసర్ హరిబండి ప్రసాదరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ మాట్లాడుతూ...అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ ప్రతినిధి బృందం ఏప్రిల్ 21 నుండి 4 రోజులు భారతదేశంలో పర్యటిస్తున్నారు. ఏప్రిల్ 22,23,24 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఉండి "సైమన్ గో బ్యాక్" లాగా వాన్స్ గో బ్యాక్ భారతదేశం అమ్మకానికి లేదు. బీజేపీ నేతత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదం ముందు పూర్తిగా లొంగిపోవడాన్ని వ్యతిరేకిస్తూ విస్తత స్థాయిలో నిరసనలు తెలియ చేయాలని పిలుపునిచ్చారు.

నిరసన తెలుపుతున్న ఎస్‌కెఎం నాయకులు

ఇద్దరు కూతుళ్లతో హల్దీ చెక్‌డ్యాంలో దూకిన తల్లి

- కూతుళ్లు మృతి, ప్రాణాలతో బయటపడ్డ తల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ పరిధిలోని మాసాయిపేట మండలానికి చెందిన వడ్డేపల్లి మమత.. తన ఇద్దరు కూతుళ్లతో తపాన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న హల్దీ చెక్ డ్యామ్‌లో దూకింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులూ మృతి చెందగా, తల్లి మమత ప్రాణాలతో బయటపడింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేటకు చెందిన వడ్డేపల్లి మమత (30) భర్త వడ్డేపల్లి స్వామి రెండు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. భర్త మరణం తర్వాత మమత తన ఇద్దరు కూతుళ్లు పూజిత (7), తేజస్విని (5)తో కలిసి శివ్వంపేట మండలం దంతాన్‌పల్లిలో ఉంటున్న తన తల్లివద్దనే నివాసముంటుంది. మమత ఆర్థిక, కుటుంబ కలహాలతో తీవ్రంగా మనస్తాపం చెంది, తన పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. దాంతో తన ఇద్దరు కూతుళ్లు పూజిత, తేజస్వినితో కలిసి డ్యామ్‌లో దూకగా, స్థానికులు తూప్రాన్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఎస్ఐ జి.శివానందం సంఘటనా స్థలానికి తన సిబ్బందితో హుటాహుటిన చేరుకొని తల్లి మమతను కాపాడారు. ఆ తర్వాత తన పిల్లలను కాపాడాలని తల్లి అరవడంతో స్థానికులు చెక్ డ్యామ్ నీటిలో గాలింపు చేపట్టారు. ఈతగాళ్లు పూజిత, తేజస్వినిల మృతదేహాలను ఒడ్డుకు తీసుకొచ్చారు. తన ఇద్దరు కూతుళ్లు మృతిచెందడంతో మమత బోరున విలపించింది. మమత కూతుళ్లతో సహా హల్దీ వాగులో దూకడానికి కుటుంబ గొడవలే కారణాలుగా తెలుస్తున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

వెలికి తీసిన పూజిత, తేజస్విని మృతదేహాలు

భర్తను కరెంట్ షాక్‌తో హత్య చేసిన భార్య

- కెపిహెచ్‌బిలో దారుణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని కెపిహెచ్‌బి కాలనీలో దారుణం చోటుచేసుకుంది. కట్టుకున్న భర్తను కరెంట్ షాక్‌తో చంపేసి పూడ్చిపెట్టిందో మహిళ. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు సొంతూరికి వెళ్లిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా పాతలింగాయ పల్లెకు చెందిన సాయిలు, కవిత దంపతులు. వివాహమై దాదాపు 20 ఏళ్లయింది. ఇద్దరు పిల్లలు. కెపిహెచ్‌బి కాలనీలోని మిత్ర హిల్స్‌లో ఓ గుడిసెలో నివాసం ఉంటున్నారు. కవిత సోదరి జ్యోతి, మరిది మల్లేశం కూడా ఇదే ప్రాంతంలో ఉంటున్నారు. కొంత కాలంగా సాయిలు- కవిత మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇద్దరికీ తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు సమాచారం. మరోవైపు భర్త వేధింపులు భరించలేక అడ్డు తొలగించుకోవాలని కవిత పన్నాగం పన్నింది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో సాయిలు ఇంట్లోనే కవిత, జ్యోతి, మల్లేశం మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత సాయిలు కల్లుతాగి నిద్రించాడు. ఇదే అదునుగా భావించిన కవిత.. కరెంటు షాక్‌తో సాయిలును విలవిల్లాడేలా చేసింది. కొన ఊపిరితో ఉండగా జ్యోతి, కవిత కలిసి అతడికి ఊపిరి ఆడనివ్వకుండా చేసి చంపేశారు. వేకువజామున ఐదు గంటల వరకు తర్జనభర్జన కొనసాగింది. కవిత, మల్లేశం రూ.మూడు వేలకు ఆటో మాట్లాడి జోగిపేట వైపు మృతదేహాన్ని తీసుకెళ్లారు. వారి కదిలికలపై అనుమానం వచ్చిన ఆటో డ్రైవర్ గట్టిగా మాట్లాడటంతో తమ ఊరు సమీపంలో ఉందని నమ్మబలికారు.

అయినా, అతడు వినకపోవడంతో.. మృతదేహన్ని శనివారం ఉదయం 11 గంటల సమయంలో తిరిగి మిత్ర హిల్స్‌కి తెచ్చారు. గుడిసెలోనే సాయంత్రం వరకు ఉంచారు. దుర్వాసన వస్తుండటంతో మృతదేహన్ని పడేయడానికి మలేశం చుట్టుపక్కల రెక్కీ నిర్వహించాడు. మిత్రహిల్స్ సమీపంలోనే నిర్మానుష్య ప్రాంతంలో నిర్మాణ వ్యర్థాల కింద పూడ్చి పెట్టారు. అనంతరం మల్లేశం, జ్యోతి వారు ఇంటికి వెళ్లగా కవిత లింగాయపల్లెకు వెళ్లిపోయింది. అప్పటికే సాయిలు ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులకు కవితపై అనుమానం వచ్చింది. మరోవైపు ఆటో డ్రైవర్ ఆదివారం మధ్యాహ్నం కేపీహెబీ పోలీసులకు జరిగిన విషయమంతా చెప్పారు. దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు ఆదివారం రాత్రి కవితను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఉదయం మిత్రహిల్స్‌లోని గుడిసెను పరిశీలించగా విద్యుత్తు తీగలు తగలబెట్టినట్లు గుర్తించారు. మ తదేహన్ని పడేసిన చోటుకు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. పథకం ప్రకారమే హత్య జరిగినట్లు గుర్తించిన పోలీసులు.. ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

24 నుంచి బడులకు వేసవి సెలవులు

- రేపే పాఠశాలలకు చివరి పనిదినం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలలకు ఈనెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయి. జూన్ 12న పాఠశాలలు పున:ప్రారంభమవుతాయి. అయితే రాష్ట్రంలోని పాఠశాలలకు బుధవారమే చివరి పనిదినం కావడం విశేషం. అదేరోజు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పిటిఎం) నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. రాష్ట్రంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈనెల తొమ్మిది నుంచి 17వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-2) పరీక్షలను నిర్వహించిన విషయ తెలిసిందే. బుధవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థుల మార్కులను ప్రకటిస్తారు. ప్రొగ్రెస్ రిపోర్టులను ఇస్తారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఎలాంటి తరగతులను నిర్వహించొద్దని పాఠశాలల యాజమాన్యాలను విద్యాశాఖ ఆదేశించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

యాదాద్రి కలెక్టరేట్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎల్ఎన్ఎస్ ప్లాట్ల బాధితులు

నయీమ్ అనుచరుల కబ్జాను అడ్డుకోవాలి

- యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ఎస్ఎల్ఎన్ఎస్ ప్లాట్ల బాధితుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నయీమ్ అనుచరుల కబ్జాలను అడ్డుకోవాలంటూ బాధితులు సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. భువనగిరి జిల్లా కేంద్ర శివారులోని టీచర్స్ కాలనీ శ్రీలక్ష్మీనరసింహస్వామి వెంచర్‌లో 1756 మంది ప్లాట్లను నయీమ్ అనుచరులు కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ.. శ్రీలక్ష్మీనరసింహ నగర్‌లో 1993 నుంచి 2001 మధ్య కాలంలో మ్యాచ్ సొసైటీ సభ్యులందరం కలిసి ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. నయీమ్ అనుచరులు డివిఆర్ ఎస్టేట్స్, గూడూరు నారాయణరెడ్డి మెగాసిటీ పేరుతో అబ్దుల్ రహీం పేర్ల మీద ఈ ప్లాట్లను కబ్జా చేశారని, ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ స్థలంపై 145 సెక్షన్ ప్రొహిబిషన్ కొనసాగించాలని, ప్లాట్ల స్థలాలపై ఎటువంటి బదలాయింపు జరగకుండా బ్లాక్ లిస్టులో చేర్చాలని అన్నారు. సిటి కేసులో వీరి జాబితా కూడా చేర్చడం ద్వారా ప్రభుత్వం ప్లాట్లను కాపాడాలని, ఈ స్థలాలను భూభారతిలో ఎక్కించాలని డిమాండ్ చేశారు. 2016లో ఆర్డీవో ఇంటర్ ఇన్ ఆర్డర్ 2001లో స్పెషల్ ట్రిబ్యునల్ విడుదల చేసిన ఆర్డర్లు, హైకోర్టు ఆఫ్ తెలంగాణలో రైట్ అఖిల్ ద్వారా వేసిన కేసులోని ఆర్డర్ కూడా ప్లాట్ల ఓనర్లకు అనుకూలంగా ఉందని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఏవో జగన్మోహన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ రమణి కనకదుర్గ, ప్రెసిడెంట్ మూర్తి, ఎం.రవీంద్రనాథ్, ఎస్.భరత్ భూషణ్, బి.రవికుమార్, టిఆర్.పాండే, ఎస్ఆర్.వెంకట్, జయంతి, కృప, జమునకుమారి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులు బదిలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ హైకోర్టుల న్యాయమూర్తులు ఇద్దరు బదిలీ అయ్యారు. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేందర్ మద్రాస్ హైకోర్టుకు.. జస్టిస్ పి.శ్రీసుధ కర్నాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఇతరులను భర్తీ చేయలేదు.

హెచ్ఆర్‌సిని ఆశ్రయించిన క్రిశాంక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో విచారణ పేరుతో వేధిస్తున్నారని సోమవారం హెచ్ఆర్‌సికి ఫిర్యాదు చేశారు. "ఈ కేసు విషయంలో ఇప్పటికే మూడు సార్లు విచారణకు పిలిచారు. ఈ నెల 23న విచారణకు రావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు. దర్యాప్తు పేరుతో ఏమీ విచారించకుండా సమయం వృథా చేస్తున్నారు. హక్కులకు భంగం కలిగిస్తున్న గచ్చిబౌలి పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విచారణ నిలిపివేసేలా పోలీసులను ఆదేశించాలి"అని పేర్కొన్నారు.

ఈ సిగరెట్లు విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ-సిగరెట్లు, వేప్స్ విక్రయిస్తున్న ముఠాను టిజి న్యాబ్, పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. విద్యా సంస్థల వద్ద విక్రయిస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారులు, యువతే లక్ష్యంగా ఈ ముఠా ఈ-సిగరెట్లను విక్రయిస్తోంది. ఎస్ఐడీ వాట్సప్ గ్రూప్ ద్వారా 500 మందికిపైగా మత్తు పదార్థాలను విక్రయించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితులను నాంపల్లికి చెందిన సోదరులుగా గుర్తించారు. వీరికి అమిత్ (ఢిల్లీ), వసీం (ముంబయి) సరఫరాదారులుగా ఉన్నారు. ముఠా వద్ద రూ.25 లక్షల విలువైన మత్తు పదార్థాలు, 225 అమెరికన్ డాలర్లు, 100 కెనడియన్ డాలర్లు స్వాధీనం చేసుకున్నారు.

వడదెబ్బతో మహిళా రైతు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెడుతూ వడదెబ్బకు గురై మహిళా రైతు మృతిచెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చర్లపాలెం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హనుమాన్ల ప్రేమలత (60) తనకున్న నాలుగు ఎకరాల పొలంలో వరి ధాన్యాన్ని పండించింది. పంట దిగుబడిని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చింది. అక్కడ తన ధాన్యాన్ని ఆరబెడుతూ ఎండవేడికి తట్టుకోలేక కొనుగోలు కేంద్రంలోనే మృతిచెందారు. మృతురాలికి భర్త, పిల్లలు ఉన్నారు. కొనుగోలు కేంద్రంలో చనిపోయిన మహిళా రైతు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రాజేంద్రనగర్‌లో రెచ్చిపోయిన దుండగులు

- వృద్ధ దంపతులను కత్తులతో బెదిరించి దోపిడీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులను నలుగురు వ్యక్తులు కత్తులతో బెదిరించి దోపిడీకి పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రాజేంద్రనగర్ ఎసిపి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం పిఎన్‌టి కాలనీలో ఉండే జాకీర్ అలీ ఇంటికి ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో షిఫ్ట్ కారులో వచ్చిన నలుగురు దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులను కత్తులతో బెదిరించి, అల్మారలో ఉన్న ఆరు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.20 వేల నగదును దోచుకుని వెళ్లారు. మొత్తం కారులో ఐదు మంది వ్యక్తులు రాగా నలుగురు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి దోపిడీకి పాల్పడ్డారు. ఒక వ్యక్తి కారులోనే డ్రైవింగ్ చేస్తూ నలుగురు వ్యక్తులు దోపిడీ చేయగానే.. అతివేగంగా ఆ ప్రాంతం నుంచి వెళ్ళిపోయారు. హఠాత్తుగా జరిగిన ఈ ఘటనతో షాక్‌కు గురైన వృద్ధ దంపతులు వెంటనే రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సమీపంలోని సిసి కెమెరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దుండగుల కోసం గాలిస్తున్నారు.